ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

# కళాపూర్ణోదయంలో రాయల వ్యక్తిత్వ చిత్రణ

**Dr Dakara Venkata Ramana**

TGT -Telugu,AP Model School,Tamada,Laveru,Srikakulam,Andhra Pradesh

Mail ID: rvenkat431@gmail.com

Article Received: 15/04/2026

Article Accepted: 24/05/2026

Published Online: 26/05/2026

DOI:10.53414/Sahithyatharangini.2025.3291

**వ్యాస సంగ్రహం**

ఆంధ్ర సాహిత్య చరిత్రలో శ్రీకృష్ణదేవరాయలు కాలం "ప్రబంధ యుగం"గా విశిష్ట స్థానం పొందింది. ఈ యుగంలో తెలుగు సాహిత్యం సంస్కృత ప్రభావం నుండి బయటపడి స్వతంత్ర సృజనాత్మక రూపాన్ని సంతరించుకుంది. ఈ సాహిత్య వికాసానికి నాయకుడైన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానాన్ని అలంకరించిన ప్రముఖ కవుల్లో పింగళి సూరన ఒకరు. ఆయన రచించిన కళాపూర్ణోదయం తెలుగు సాహిత్యంలో అపూర్వమైన కల్పిత ప్రబంధ కావ్యంగా నిలిచింది.

ఈ వ్యాసంలో కళాపూర్ణోదయంలోని కథానాయకుడు "కళాపూర్ణుడు" పాత్రకు శ్రీకృష్ణదేవరాయలే ప్రేరణ అని వివరించాను. కృష్ణదేవరాయల జీవిత విశేషాలు, వ్యక్తిత్వ లక్షణాలు, సాహిత్యాభిమానం, సంగీతాభిరుచి, యుద్ధవిజయాలు, రాజనీతి, సాంస్కృతిక వైభవం వంటి అనేక అంశాలు కళాపూర్ణుడి పాత్రలో ప్రతిబింబించాయని చెప్పవచ్చు.

శ్రీకృష్ణదేవరాయల జీవితంలో పట్టాభిషేకానికి ముందు, తరువాత అనే రెండు దశలు ఉన్నట్లే కళాపూర్ణుడి జీవితంలో కూడా మణికంధరుడు, కళాపూర్ణుడు అనే రెండు జన్మల రూపకల్పన కనిపిస్తుంది. కృష్ణదేవరాయలు తిమ్మరుసు వద్ద విద్యాభ్యాసం పొందగా, మణికంధరుడు నారదుని వద్ద శిక్షణ పొందాడు. ఇద్దరూ కవులు, విష్ణుభక్తులు, సంగీతకళా ప్రవీణులు. చిన్నాదేవి–తిరుమలదేవి, అభినవకౌముది–మధురలాలస పాత్రల మధ్య కూడా అనేక పోలికలు ఉన్నాయని వ్యాసం ద్వారా చెప్పవచ్చు.అలాగే రాజసభలో కవులకు గౌరవం, సంగీత–సాహిత్యాలకు ప్రాధాన్యం, శిల్పకళాభివృద్ధి, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారం వంటి సాంస్కృతిక అంశాలలో కూడా కళాపూర్ణుడు మరియు కృష్ణదేవరాయల మధ్య సమానతలు కనిపిస్తాయి. యుద్ధవిజయాలు, దిగ్విజయ యాత్రలు, శత్రువులను క్షమించడం వంటి కథనాల్లో కూడా ఈ సారూప్యత స్పష్టమవుతుంది.ఈ విధంగా పింగళి సూరన తన కల్పనాశక్తితో సృష్టించిన కళాపూర్ణుడి పాత్రలో శ్రీకృష్ణదేవరాయలు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబింపజేశాడని ఈ వ్యాసం తెలియజేస్తుంది.

**కీలక పదాలు:**ప్రబంధ యుగం,శ్రీకృష్ణదేవరాయలు,పింగళి సూరన,కళాపూర్ణోదయం,కళాపూర్ణుడు,మణికంధరుడు, విజయనగర సామ్రాజ్యం,సాహితీసమరాంగణ, సార్వభౌముడు, అష్టదిగ్గజాలు,సంగీతకళ, శిల్పకళ,విశిష్టాద్వైతం, దిగ్విజయ యాత్రలు,తెలుగు సాహిత్యం,సాంస్కృతిక సారూప్యతలు,

**శ్రీకృష్ణదేవరాయల ప్రతిరూపం కళాపూర్ణుడు**

ఆంధ్ర సాహిత్య చరిత్రలో విలక్షణమైనది శ్రీకృష్ణదేవరాయల నాటి ప్రబంధ యుగం. ఆదికవి కాలం నుండి శ్రీనాథ కాలం వరకు జనించిన సాహిత్యానికి భిన్నమైన, విశిష్టమైన సాహిత్యం రాయల యుగంలో ఉత్పన్నమైంది. సంస్కృత సాహిత్యాస్వాదనకు అలవాటుపడిన ఆంధ్రసాహిత్యం ఈ కాలంలోనే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొంది ఉవ్వెత్తున ఎగిసిపడింది. అలాంటి అద్భుత సాహిత్య యుగానికి నాయకుడు శ్రీకృష్ణదేవరాయలు. ఆ కృష్ణరాయల కొలువులోని అష్టదిగ్గజాల్లో ఒకడిగా పేరొందినవాడు పింగళి సూరన. అయితే పింగళి సూరన కృష్ణదేవరాయల తరువాత కాలానికి చెందినవాడని కూడా కొందరు భావిస్తారు. ఏది నిజమైనప్పటికీ, సూరన రాయలు ఏలిన సామ్రాజ్యంలో తిరుగాడినవాడనీ, రాయలను తన కావ్యపాత్రలలో ఇమడ్చి మురిసిపోయినవాడనీ చెప్పవచ్చు.

పింగళి సూరన రచించిన ప్రధాన కృతులు రాఘవపాండవీయం, ప్రభావతి ప్రద్యుమ్నం, కళాపూర్ణోదయం. వీటిలో కళాపూర్ణోదయం అత్యంత అపూర్వమైనది. ఇది సంపూర్ణ కల్పిత ప్రబంధం. భట్టుమూర్తి "కేవల కల్పన కథలు కృత్రిమ రత్నాలు" అని నిరసించినప్పటికీ, సూరన తన అద్భుత కల్పనాశక్తితో ఈ ప్రబంధాన్ని అత్యంత రమ్యంగా తీర్చిదిద్దాడు. ఈనాటి నవలలకు, సినిమాలకు ఏమాత్రం తీసిపోని విధంగా కావ్యాన్ని మలిచాడు.

పింగళి సూరన తన కళాపూర్ణోదయంలోని నాయకుడిని, తన కనుల ముందున్న నాయకుడైన శ్రీకృష్ణదేవరాయలను చూసి చిత్రించాడా అన్నట్లు అనేక సాదృశ్యాలు కనిపిస్తాయి. ఈ కావ్యంలో కళాపూర్ణుడి పాత్రకు శ్రీకృష్ణదేవరాయలే ప్రేరణ, ఆలంబన, స్ఫూర్తి అని చెప్పవచ్చు. శ్రీకృష్ణదేవరాయుని వాస్తవ చరిత్రకు, కళాపూర్ణుడి కల్పిత గాథకు ఉన్న సమాన ధర్మాలను బట్టి కళాపూర్ణుడు కృష్ణదేవరాయల ప్రతిరూపమని భావించవచ్చు.ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు తన "తెలుగు సాహిత్య చరిత్ర"లో రాయలు–కళాపూర్ణుల మధ్య గల అనేక పోలికలను వివరించారు.

**జీవిత సాదృశ్యాలు**

శ్రీకృష్ణదేవరాయుని జీవితంలో రెండు దశలున్నాయి:

పట్టాభిషేకానికి ముందు దశ

పట్టాభిషేకానికి తరువాత దశ
అలాగే కళాపూర్ణ మహారాజు వృత్తాంతంలో కూడా రెండు జన్మలున్నాయి:
మణికంధరుడి జన్మ
కళాపూర్ణుడి జన్మ

శ్రీకృష్ణదేవరాయలు పూర్వదశలో కృష్ణరాయలుగా తిమ్మరుసు మహామంత్రి వద్ద శిక్షణ పొందాడు. కళాపూర్ణుడు మణికంధరుడిగా నారదమునీంద్రుని వద్ద విద్యాభ్యాసం చేశాడు.కృష్ణదేవరాయలు స్వయంగా కవి; మణికంధరుడు కూడా కవియే. వీరిద్దరి కవిత్వం విష్ణుభక్తిని ప్రతిబింబిస్తుంది. ఇరువురికీ ఇష్టదైవం తిరుపతి వేంకటేశ్వరుడే. కృష్ణరాయలు అజ్ఞాతవాసం గడిపినట్లే మణికంధరుడు ఆశ్రమవాసిగా జీవించాడు.కృష్ణదేవరాయలు వివాహానికి ముందే చిన్నాదేవితో ప్రేమలో పడ్డాడు. మణికంధరుడు కూడా కలభాషిణితో ప్రణయం సాగించాడు. చిన్నాదేవి వేశ్యాస్త్రీ అని, కలభాషిణి కూడా వేశ్యయేనని తెలుస్తుంది. ఈ విధంగా ఇద్దరి జీవితాల్లోనూ వేశ్యాస్త్రీల ప్రభావం కనిపిస్తుంది.కృష్ణదేవరాయల దేవేరులైన చిన్నాదేవి, తిరుమలదేవిలలో తిరుమలదేవి రాజకుమారి. అలాగే కళాపూర్ణుడి దేవేరులలో అభినవకౌముది దేవవేశ్య, మధురలాలస రాకుమారి. చిన్నాదేవి సమ్మతంతోనే కృష్ణదేవరాయలు తిరుమలదేవిని వివాహం చేసుకున్నాడు. అలాగే అభినవకౌముది సమ్మతితోనే కళాపూర్ణుడు మధురలాలసను వివాహం చేసుకున్నాడు. రాయలు, కళాపూర్ణుడు ఇద్దరూ శృంగారరస పరిపోషణలో చక్రవర్తులే.

**సాంస్కృతిక సారూప్యతలు**

శ్రీకృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు. కళాపూర్ణోదయంలోని కళాపూర్ణ మహారాజు కూడా సాహితీ సమరాంగణ సార్వభౌముడే.శ్రీకృష్ణదేవరాయల భువనవిజయంలో అష్టదిగ్గజ కవులు ఉన్నట్లే కళాపూర్ణుడి ఆస్థానంలో చతురాగమ విద్వత్కవులు ఉన్నారు. రాయల ఆస్థానంలో ప్రవేశానికి ప్రయత్నించిన సంకుశాల నృసింహకవికి అవరోధం కలిగినట్లు ఐతిహ్యం ఉంది. అలాగే కళాపూర్ణోదయంలో కూడా కవులు రాజస్థాన ప్రవేశానికి పడిన కష్టాలు కనిపిస్తాయి.కృష్ణదేవరాయలు వీణావాదనలో ప్రవీణుడు. మణికంధరుడు కూడా వీణావాదన కళలో నైపుణ్యం కలవాడు. చిన్నాదేవి చిన్ననాటి నుంచే సంగీతంలో ప్రవీణురాలు. అభినవకౌముది కూడా ఆజన్మసిద్ధ సంగీతకళా ప్రవీణురాలు. తిరుమలదేవి సంగీతాన్ని పట్టుదలతో అభ్యసించింది. కళాపూర్ణుడి పట్టపురాణి మధురలాలస కూడా సంగీత విద్యలో నైపుణ్యం సంపాదించింది.శ్రీకృష్ణదేవరాయల కాలంలో సంగీతం, సాహిత్యం మాత్రమే కాక శిల్పకళ కూడా అభివృద్ధి చెందింది. హంపి, విజయనగర నిర్మాణాలు దీనికి సాక్ష్యాలు. అలాగే కళాపూర్ణోదయంలో వర్ణించిన శిల్పకళ కూడా అత్యున్నత స్థాయిలో ఉన్నట్లు తెలుస్తుంది.కళాపూర్ణోదయంలోని శిల్పసౌందర్యాన్ని తెలియజేసే పద్యం:

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

"బళిర శిల్పికులేంద్ర బ్రహ్మను మీఱితే
పగిది జేసితిరి యీ ప్రతిమలనుచు
దనమది గడుమెచ్చి తలయూచుచును
నిట్టి పడుతులు గల రోకో పుడమిసనుచు"
ఈ పద్యం ద్వారా శిల్పకళా వైభవం స్పష్టమవుతుంది.

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద లో విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కళాపూర్ణుడు కూడా "లక్ష్మీనారాయణ సంవాదం"లో విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించాడు. ఈ విధంగా అనేక సాంస్కృతిక అంశాల్లో రాయలు, కళాపూర్ణుడు మధ్య పోలికలు కనిపిస్తాయి.కథనరంగ సామీప్యతలు శ్రీకృష్ణదేవరాయుడు యుద్ధరంగంలో అపూర్వ వీరుడు. అలాగే కళాపూర్ణుడు కూడా మహా యోధుడు. కృష్ణదేవరాయల ఉత్కళ దేశ దండయాత్రలకు తిరుమలదేవి కారణమనే కథ ఉంది. అలాగే కళాపూర్ణుడి సకల దేశ దండయాత్రలకు మధురలాలస కారణమని కళాపూర్ణోదయం తెలియజేస్తుంది. ఈ ఇరువురి దండయాత్రల ఫలితమే దిగ్విజయ పరంపర.శ్రీకృష్ణదేవరాయల కాలంలో వాడిన దంచనములు, ఫిరంగులు, తుపాకులు వంటి యుద్ధసామగ్రి కళాపూర్ణోదయంలో కూడా ప్రస్తావించబడింది.కృష్ణదేవరాయలు కొండవీటి యుద్ధంలో ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్రగజపతిని ఓడించి, అతన్ని క్షమించి దుర్గాధిపతిగా నియమించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. అలాగే కళాపూర్ణుడు కూడా ఉత్కళరాజును జయించి, ప్రాణాలతో విడిచిపెట్టాడు.శ్రీకృష్ణదేవరాయల చేతిలో కళింగ, తమిళ, కర్ణాట పాలకులు పరాజయం పొందినట్లే కళాపూర్ణుడి చేతిలో కళింగ, ద్రావిడ, చోళ, పాండ్యాది భూపతులు వశవర్తులయ్యారని కావ్యం తెలియజేస్తుంది.

**ఉపసంహారం**

తెలుగు ప్రబంధ సాహిత్యంలో కళాపూర్ణోదయం ఒక అపూర్వమైన కల్పిత ప్రబంధ కావ్యంగా చిరస్థాయిగా నిలిచింది. ఈ ప్రపంచంలో పింగళి సూరన సృష్టించిన కళాపూర్ణుడి పాత్రలో శ్రీకృష్ణదేవరాయలు వ్యక్తిత్వ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. సాహిత్యాభిరుచి, సంగీతప్రేమ, రాజనీతి, యుద్ధవిజయాలు, సాంస్కృతిక వైభవం వంటి అనేక అంశాలలో ఈ ఇద్దరి మధ్య గాఢమైన సారూప్యతలు ఉన్నాయి. అందువల్ల కళాపూర్ణుడు కేవలం కల్పిత పాత్ర మాత్రమే కాక, శ్రీకృష్ణదేవరాయల మహోన్నత వ్యక్తిత్వానికి సాహిత్యరూపమైన ప్రతిబింబమని చెప్పవచ్చు. ఈ కావ్యం ద్వారా పింగళి సూరన తన అసాధారణ కల్పనాశక్తిని, తెలుగు సాహిత్య వైభవాన్ని చిరస్థాయిగా నిలబెట్టాడు.

**ఆధార గ్రంథాలు**

కళాపూర్ణోదయం – పింగళి సూరన

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి – తెలుగు సాహిత్య చరిత్ర (మూడవ సంపుటి)
ఆచార్య జి. నాగయ్య – తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటి)